క్లుప్తంగా

నేడు 'స్పందన'

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ పబ్బారి శంకరరావు ఆదివారం తెలిపారు. స్పందనలో గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు అందజేయాలని, వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు.

230 మందికి వైద్య పరీక్షలు

నందిగామ: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మండలంలోని లింగాలపాడు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో లింగాలపాడు పరిసర గ్రామాలకు చెందిన 230 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సేవా సంస్థల మెడికల్ ఇన్‌చార్జి టి.రాఘవరావు, పలువురు సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

పెనుగంచిప్రోలు: మునేరుకు వరదల కారణంగా స్థానిక కాజ్‌వే పక్కన ఉన్న అన్నపూర్ణ సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం 10 రోజులుగా మూతబడింది. వరద తగ్గటంతో ఆదివారం ఆలయ చైర్మన్ పర్చా ప్రతిభ ఆధ్వర్యంలో అర్చకుడు రేలంకి భాస్కరశర్మ ఆలయంలో సంప్రోక్షణ అనంతరం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో అన్నదానం




జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధిని కాంక్షిస్తూ స్థానిక 13వ వార్డు, రజక బజారులోని పీర్ల సావిడి వద్ద ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ, వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ జుబేర్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యంతో ఉండాలని, జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మరింతగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తూ అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు జుబేర్ తెలిపారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం మండలంలోని కొణకంచి గ్రామానికి చెందిన నాగసాని వెంకటనారాయణ దంపతులు రూ.10,116లు విరాళం ఆలయ ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుకు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతను అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో సత్కరించారు.

అమ్మవారికి ఛత్రాల సమర్పణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారికి ఆదివారం తమిళనాడు రాష్ట్రం, చెన్నై నగరంలోని షావుకారు కాలనీకి చెందిన ఎం.రమేష్, లక్ష్మీశ్యామల దంపతులు ఉత్సవాల్లో ఉపయోగించే ఒక జత ఛత్రాలు ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడుకు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా దాతకు వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలతో సత్కరించారు.

గద్దర్ మృతికి నివాళి

కంచికచర్ల: ప్రజా యుద్ధ నౌక, తెలంగాణా పోరాట యోధుడు గుమ్మడి విఠల్‌రావు అలియాస్ గద్దర్ ఆకస్మికంగా మృతి చెందటం బాధాకరమని బహుజనుల రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కవి, రచయిత తంగిరాల సోనీ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. కారంచేడు, చుండూరు ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారుడన్నారు. పాటల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చిన గద్దర్‌ను ప్రజలు ఎన్నటికి మర్చిపోరన్నారు. పాటల తూటా, కాలి గజ్జలతో ఒక ఊపు ఊపిన చైతన్య కెరటం. దేశ విదేశాల్లో అనేక ప్రదర్శనలతో భారతదేశ సంస్కృతిని, ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన ప్రజా వాగ్గేయకారుడన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం గళమెత్తిన విప్లవ గొంతుక గద్దర్‌కు నివాళులర్పించారు.

ప్రభుత్వ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను
- 2వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



పేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ సచివాలయం పరిధిలో 2వ వార్డులోని పెద్దాయన వీధిలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేవి కావని, నేడు మన జగనన్న ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. పేదలకు మంచి చేయకుండా ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేస్తున్నా, పేదల సంక్షేమం కోసం అవేమి లెక్కచేయకుండా మొక్కవోని ధైర్యంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నారని తెలిపారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు..

వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే ఉదయభాను ప్రజలు చెబుతున్న సమస్యలను సావధానంగా వింటూ, అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ ప్రజల నుంచి కృతజ్ఞతలు అందుకుంటూ ముందుకు సాగారు. వార్డులో ముఖ్యంగా ఈనాం భూముల సమస్య పరిష్కరించాలని పలువురు కోరారు. అలాగే డ్రెయిన్లు, సీసీ రోడ్లు నిర్మించాలని, స్టేడియం రోడ్డు నుంచి తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరగా, మున్సిపల్ అధికారులతో మాట్లాడి అందుకు తగిన విధంగా ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఈనాం భూముల సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో పరిష్కారమవుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, విజయవాడ దుర్గగుడి డైరెక్టర్ నంబూరి రవి, కౌన్సిలర్ కొలగాని రాము, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు, ఏఎంసీ డైరెక్టర్ పింగళి నరసింహారెడ్డి, మైనార్టీ నాయకుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, తన్నీరు నాగేంద్ర, నాయకులు గద్దల మంగయ్య, మేకపోతుల శివయ్య, భానుప్రకాష్, గింజుపల్లి గోపి, కృష్ణ, వల్లంకొండ రామారావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



నందిగామ పీఎస్ పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ జనార్దన్‌నాయుడు

నందిగామ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఏసీపీ జనార్దన్ నాయుడు సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లలో మార్పు వస్తే షీట్ తొలగించే అవకాశం ఉందన్నారు. ప్రతి రౌడీషీటర్ పైన ప్రత్యేక నిఘా ఉంటుందని గుర్తు చేశారు. అనవసరంగా వివాదాలకు పోయి జైలు పాలు కావద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ హనీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



నందిగామ ప్రాంతంలో పత్తి పొలంలో పైపాటు చేస్తున్న రైతు

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వరుస వర్షాల తర్వాత గత నాలుగు రోజులుగా వాతావరణం సాధారణంగా ఉంది. ఈ నేపథ్యంలో పత్తి పొలాల్లో వర్షం కారణంగా ఏర్పడ్డ కలుపు తీయడంతో పాటు పొలాలలో పైపాటు పనులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా పంటకు మరింత బలాన్ని చేకూర్చేందుకు పలు రకాల ఎరువులు వెదజల్లుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఈ ఏడాది నందిగామ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలలో 12,563 హెక్టార్లలో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఆయా పొలాల్లో పంట ప్రస్తుతం నెల రోజుల దశలో ఉంది. ఈ నేపథ్యంలో పంట మరింత ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన ఎదవులను అందజేస్తున్నారు.

ఎత్తిపోతల పథకం వద్ద మరమ్మతులు



పెనుగంచిప్రోలు: మునేరుకు వరద వచ్చి స్థానిక ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురైంది. దీంతో సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు జేసీబీ, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి మరమ్మతు పనులు చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. పనులను సొసైటీ మాజీ అధ్యక్షుడు కొల్లా రఘురామయ్య పర్యవేక్షిస్తున్నారు.

హోంగార్డు వెంకట్ మృతి బాధాకరం



నందిగామటౌన్: హోంగార్డు కత్తి వెంకట్ అకాల మృతి బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలో వెంకట్ మృతదేహాన్ని ఆదివారం ఎమ్మెల్యే సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయటమే కాకుండా ప్రజా మన్ననలు పొందారన్నారు. విధి నిర్వహణలో న్యాయానికి కట్టుబడి పని చేశారని గుర్తు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలి

పెద్దాపురం(వీరులపాడు): వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామ శివారులో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే సహించేది లేదన్నారు. ముఖ్యంగా ఆటోల్లో పరిమిత సంఖ్యలో మాత్రమే ప్రయాణికులను ఎక్కించాలన్నారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సానుభూతి సర్పంచుల తీరు దుర్మార్గం

– ఎంపీపీ మలక్‌బషీర్



కంచికచర్ల: గ్రామాల అభివృద్ధికి మోకాలడ్డుతున్న టీడీపీ సానుభూతి సర్పంచుల తీరు దుర్మార్గమని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఎంపీపీ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌ల సహకారంతో పార్టీలకతీతంగా అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీల సర్పంచ్‌లు అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. పెండ్యాల గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు మండల పరిషత్ నుంచి రూ.40 లక్షల నిధులు మంజూరు చేశామని అయితే గ్రామ సర్పంచ్ ఆ పనులు చేపట్టేందుకు గ్రామ పంచాయతీలో తీర్మానం ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలోని జగనన్న కాలనీలోకి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణ పనులు, రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా అయ్యే విద్యుత్ మోటార్లకు మరమ్మతు చేపట్టామని ఆ నిధులు డ్రా చేద్దామంటే సర్పంచ్ తీర్మానం చేయడం లేదన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా గ్రామానికి తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవటంతో ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సొంత నిధులతో ప్రజలకు తాగునీటిని సరఫరా చేశామని గుర్తు చేశారు. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ల ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించామన్నారు. అదేవిధంగా మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో రూ.12 లక్షలు, గనిఆత్కూరు గ్రామానికి రూ.10 లక్షల నిధులు ప్రాధాన్యతా క్రమంలో కేటాయిస్తే ఆయా గ్రామ సర్పంచులు తీర్మానాలు ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా గ్రామాలను పార్టీలకతీతంగా అభివృద్ధి చేసేందుకు నాయకులు, ప్రజలందరూ సహకారాన్ని అందించాలని ఎంపీపీ కోరారు.

ఓటమి భయంతోనే పుంగనూరు విధ్వంసకాండ



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శివారెడ్డి, అంకమోహనరావు

ఇబ్రహీంపట్నం: ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు పుంగనూరులో విధ్వంసకాండ సృష్టించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పీఏసీఎస్ చైర్మన్ మునగాల సాంబశివారెడ్డి, జిల్లా కార్యదర్శి లంకే అంక మోహనరావు, కొండపల్లి పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ అన్నారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం వైఎస్సార్ సీపీ కార్యాలయాల వద్ద టీడీపీ విధ్వంసకాండను తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం నాయకులు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండబట్టే టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని పన్నాగం పన్నారన్నారు. పోలీసులపై దాడిచేయడం, గాయాల పాలుచేయడం దారుణం అన్నారు. జిల్లా ఐటీవింగ్ అధ్యక్షుడు ప్రసన్నబోసు, కౌన్సిలర్ వెంకయ్య నాయుడు, గురవయ్య, బ్రహ్మజీ, ప్రకాష్, దివాకర్, చిన్నయ్య, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి బస్సుల్లో ఈవో తనిఖీలు



కండక్టర్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రైల్వేస్టేషన్, బస్టాండ్‌ల నుంచి దేవస్థానానికి నడుపుతున్న బస్సుల్లో దుర్గగుడి ఈవో భ్రమరాంబ తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఓం టర్నింగ్ వద్ద బస్సులను తనిఖీ చేసిన ఈవో భ్రమరాంబ భక్తులతో మాట్లాడారు. కండక్టర్ వద్ద మెషిన్ రికార్డు పరిశీలించడంతో పాటు టికెట్ల డబ్బులను లెక్కించారు. రికార్డు మొత్తానికి టికెట్ల డబ్బులు సరిపోవడంతో వారికి పలు సూచనలు చేశారు. భక్తులతో మర్యాద పూర్వకంగా మెలగడం, వారిని సకాలంలో రైల్వే స్టేషన్, బస్టాండ్‌లకు చేర్చేలా చూడాలని ఆదేశించారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. చదవడం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా చిన్నారుల కోసం ప్రదర్శన జరిగింది. గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ పౌర గ్రంథాలయ శాఖ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులకు నీతి కథలు, చందమామ కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ప్రదర్శించి, వారితో చదివించారు. అనంతరం సరస్వతీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఉచితంగా నాట్యంలో శిక్షణ ఇచ్చారు. చిన్నారులు నృత్య రీతులను, సంగీత సాధన చేశారు. కార్యక్రమంలో నృత్య శిక్షకులు భాగవతుల వెంకట సీతారామ శర్మ, గ్రంథాలయ సిబ్బంది వై.ధనలక్ష్మి, కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగపుత్రుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్సీ అరుణకుమార్



గంగమ్మ బోనాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: గంగపుత్రుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 17వ వార్డులో ఆదివారం నిర్వహించిన గంగమ్మ తల్లి బోనాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ.. ప్రతిఏటా గంగపుత్రులు బోనాల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించటం అభినందనీయమన్నారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఫిష్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మత్స్య సంపదను దేశ విదేశాలకు పంపుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యుడు బాపట్ల సాంబయ్య, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుడివాడ సాంబశివరావు, పట్వా శ్రీను, షేక్ కరిముల్లా, యాకుబ్ అలీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి సొసైటీలు కృషి చేయాలి



పోచంపల్లి సొసైటీ చైర్మన్ పరమేశ్వరరావును అభినందిస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: రైతుల అభ్యున్నతికి గ్రామాల్లోని ప్రాథమిక సహకార పరపతి సంఘం కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండలంలోని పోచంపల్లి, గౌరవరం సహకారం సంఘాలకు నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సొసైటీలు రైతు సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రాయితీపై అందించటంతో పాటు పండించిన పంటను గిట్టుబాటు ధరకు విక్రయించేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

కీలక సంస్కరణలు

సొసైటీల ద్వారా డ్వాక్రా మహిళలకు సకాలంలో రుణాలు అందించాలని విప్ ఉదయభాను చెప్పారు. నాలుగేళ్లలో పలు కీలక సంస్కరణలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వాలు సొసైటీలను నిర్వీర్యం చేస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొసైటీల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అనంతరం పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా పెడవల్లి పరమేశ్వరరావు, గౌరవరం పీఏసీఎస్ చైర్మన్‌గా అన్నాబత్తుల శ్రీనివాసరావులతో పాటు సభ్యుల ప్రమాణ స్వీకారం చేయించారు. అదే విధంగా డ్వాక్రా సంఘాలకు రూ. 1.40 కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, కేడీసీసీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, సొసైటీ మాజీ చైర్మన్ గంగూరి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



కంచికచర్లలో రహదారిని పరిశీలిస్తున్న సురేష్, నాయకులు

కంచికచర్ల: 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పాత శివాలయం రోడ్డుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక పాత శివాలయం రోడ్డులో వేస్తున్న సిమెంట్ రోడ్డుతో పాటు డ్రెయినేజీ పనులను ఆదివారం పరిశీలించారు. ఈమేరకు సురేష్‌బాబు మాట్లాడుతూ.. ఇటీవల కంచికచర్ల పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో 6వ వార్డు ఇన్‌చార్జి దేవరకొండ గురవయ్య అధ్వానంగా ఉన్న రోడ్డు, మురుగునీరు పారుదలకాని డ్రెయినేజీ గురించి తెలియజేశారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి సిమెంట్ రోడ్డు నిర్మాణం, డ్రెయినేజీ అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంటనే పనులు ప్రారంభించారు. ఇదే రోడ్డుపై సీఐ కార్యాలయం, పెద్దబజార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారన్నారు. రోడ్డుకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టటం అభినందనీయమని వేమా అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నారిశెట్టి శ్రీనివాసరావు, గోగినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విప్ ఉదయభాను, నాయకులు

పోచంపల్లి(జగ్గయ్యపేట): గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. గ్రామం నుంచి 65వ నెంబరు జాతీయ రహదారి వరకు జిల్లా మైనింగ్ గ్రాంట్ రూ.2 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధితో పాటు గ్రామాల నుంచి జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉండే రహదారుల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తూ నిర్మాణం చేపడుతుందన్నారు. గ్రామం నుంచి జాతీయ రహదారి వరకు మూడు కి.మీల మేర కొద్ది రోజుల్లో తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు రహదారి కావాలని కోరుకుంటున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. అంతే కాకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేయటంతో పాటు నూతన రహదారుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో లింకు రోడ్ల నిర్మాణం చేపట్టకపోవటంతో పాటు శివారు గ్రామాలకు రహదారులు లేకపోవటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ పెడవల్లి పరమేశ్వరరావు, మాజీ చైర్మన్ తిప్పిరెడ్డి ఓంకారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు శీలం బ్రహ్మం, గుంట లక్ష్మీనారాయణ, ఇరుగు రవీంద్ర, పీఆర్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. మంగళగిరికి చెందిన నటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ప్రదర్శన ఇవ్వగా, భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.